# పలాయనం

"మల్ల మస్తుగ తాగొచ్చిండురో నాయినో! పొద్దెక్కిందో లేదో తాగి సోయిలేకుంట పడిపోయిండు" ఇస్త్రీకి వచ్చిన బట్టలమూటల మీద నిద్రపోతున్న మొగుణ్ని చెంద్రయ్యను చూసి యాష్టపడ్డది మల్లమ్మ.

"గింత పొద్దున్నే తాగేటందుకు పైసలెక్కడ్నుంచి ఒచ్చినయి! గిరాకోల్ల దగ్గర అడుక్కొచ్చుకున్నవ? ఏందయ్యా! నా కెరుకలేక అడ్గుత! - గా పైసలు పొట్టల పోసుకుంటె పోరగాల్లకు కూడు ఎక్కడ్నుంచి ఒస్తదనుకున్నవ్? నిన్నెత్తుకపోను! - నేనంటున్నది ఏమైన ఇంటున్నవ? నా ఒర్లుడే గాని! రోజు తాగేది మాత్రం ఆగుతలేదు!" తెచ్చిన ఇస్త్రీబట్టల మూటను ఇస్త్రీబల్ల మీద పెట్టింది మల్లమ్మ. మల్లమ్మ మాటలకు చెంద్రయ్యలో ఏ చలనమూ కన్పించలేదు.

గిరాకి ఇళ్ళ నుంచి ఇస్త్రీకోసం తెచ్చిన బట్టలను అర్జంటుగా చేసియ్యమని ఇచ్చారు. కడుపులో కాలుతున్నా మల్లమ్మ ఇస్త్రీపెట్టెలో బొగ్గులేసి ఇంత గ్యాసునూనె పోసి అంటు పెట్టింది. ఇస్త్రీపెట్టె కాస్త వేడెక్కగానే మల్లమ్మ ఇస్త్రీ చేయడం మొదలుపెట్టింది.

చెంద్రయ్య ఎప్పుడు లేచాడో లేచి కూర్చున్నాడు. కాస్సేపు ఎక్కడున్నానా అన్నట్లుగా గాజు ముక్కల్లాంటి కళ్ళను అటుయిటు తిప్పి చూసాడు. లేచి నిలబడ్డాడు. మల్లమ్మ భుజం గట్టిగా పట్టుకొని గుంజి వీపుమీద ధన్నధన్నమని గుద్దాడు హఠాత్తుగా. ఆ దెబ్బలకు తట్టుకోలేక మల్లమ్మ "అమ్మో! అయ్యో!" అని మొత్తుకుంది.

"లంజె! త-గొచ్చినవు! తాగొచ్చినవు! అని మొత్తుకుంటున్నవేందే? అందరికి ఇనపడేటట్లు! నీ అయ్య సొమ్ముతోనా నేను తాగింది?" పళ్ళు బిగపట్టి అడిగాడు చెంద్రయ్య. స్థిరంగా నిలబడలేక అతడు ఊగిపోతున్నాడు.

దెబ్బలకు ఒళ్ళు నొప్పిగా వున్నా ఆగకుండా ఇస్త్రీ చేస్తూనే వుంది మల్లమ్మ. - గీ

బట్టలు జల్దీ అయితే గిన్ని పైసలు ఎంటనే చేతులబడ్తయి! గిన్ని నూకలు ఒస్తయి. రాతిరికైన కడుపునిండ పోరగాల్లకు తనుకు గింత కూడయినా దొరుకుతది!" అన్న ఆలోచన మల్లమ్మ మనస్సులో జోరీగ లాగ తిరుగుతున్నది. ఆమె చేతిలోని ఇస్త్రీపెట్టె ఆగడం లేదు.

చెంద్రయ్య అక్కడ్నుంచి కదలలేదు.

"నా అయ్య తాగిండు! నా తాత తాగిండు! గట్లనే నేను తాగుత! నువ్వేం జేస్తవొ చెయ్యి చూస్త!" ఆగాడు చెంద్రయ్య. మల్లమ్మ దిక్కు కండ్లార్పకుండా చూసాడు. మల్లమ్మ ఏం మాట్లాడలేదు.

"నువ్వెవరే నన్ను తాగొచ్చినవ్! తాగొచ్చినవ్ అనేటందుకు! లంజముండ! చెప్పే! - నా ఇష్టం నేను తాగుత నువ్వెవరే అడిగెటందుకు!" చెంద్రయ్య మునివేళ్ళ మీద నిలబడి సోలుతూనే సవాల్ చేస్తూ అడిగాడు.

నోరు విప్పితే ఇప్పుడు పంచాయితి అయితది. "పొద్దున్నే గీ లొల్లి ఎందుకు? ఒర్లి ఒర్లి ఆడే పోతడు. కయ్యానికి కాలు దువ్వుతున్నడు. గీవీనితోటి ఎవరు పెట్టుకుంటరు గింత పొద్దుగాలనె. ముందుగాల గీ బట్టలు ఇస్త్రీ కావాలె" అనుకుంది మల్లమ్మ. ఏం మాట్లాడలేదు.

"నేను మగోడినే! గట్లనే తాగుత! నీ అవ్వ! ఏం జేసుకుంటవో చేసుకో!" మళ్ళా సవాల్ చేసాడు చెంద్రయ్య. అతని కనుగుడ్లు రెప్పల కింద మూసుకపోతున్నాయి. ఇక మల్లమ్మ నోరు ఆగలేదు.

"నువ్వు మగోడివే! నాకెరుకలేద? దిమాగ్‌లేని మగోడివి! పైసలిట్ల తాగుడుకు తగలబెట్టి పోరగాల్లు ఏం అయితరనుకుంటున్నవ్! పొద్దంత ఇస్త్రీచేసి చేసి నా చేతులు పడిపోతున్నయి. డబ్బల యేసి ఓరకు పెట్టిన పైసలు ఎత్తుకపోయి తాగితివి. ఆఖరికి గిరాకోల్ల కాడ పైసలు తెచ్చుకుని తాగుతుంటివి! ఆగు గా గిరాకోల్లకు నీకు పైసలియ్యొద్దని చెప్త!" అంది మల్లమ్మ.

"నీతోటి గా ఇస్త్రీ కాకపొతె గట్లనే పెట్టు నేను చేస్త! సేతగాని ముండ! ఎప్పుడు మిడుకుతనే వుంటది. పనికి పిరికోన్ని గానే నేను. కట్టానికి ఓర్వనోన్ని గానే నీ లెక్క! బద్మాష్ ముండ పనికి ఒంగదుగాని బర్రెనోరు పెట్టుకొని ఒర్లుతది! సూడు చణంలో ఎన్ని బట్టలు సేసి సూపిస్తనో!" అని చాతిమీద చరిచి చెంద్రయ్య మల్లమ్మ వైపు రెండడగులు సోలుతూ వేసి కింద భూమ్మీద కుప్పగా కూలిపోయాడు.

"నిన్నెత్తుకపోను! తాగుడెప్పుడు బందయితదో ఈడికి సర్కారోల్లు బందు పెట్టినట్లే పెట్టి ఇసొంటోల్ల దొంగ యేపారానికి యేగలేక మల్ల ఖుల్ల చేసింద్రు" మల్లమ్మ తన కోపాన్నంతా ఇస్త్రీ పెట్టె మీద చూపుతూ ఇస్త్రీపెట్టెను ఎత్తిఎత్తి పడేస్తూ ఇస్త్రీ చేయడం ఆపకుండా చేస్తూనే వుంది. కిందపడిపోయిన చెంద్రయ్య లేచాడు. మాట్లాడకుండా బీడి వెలిగించుకొని బయటికి వెళ్ళిపోయాడు.

పొద్దున్నే ఇస్త్రీ చేసిన ప్యాంటు షర్టు తీసుకపోతె గిరాకి ఇచ్చిన పైసలు ఇచ్చి నూకలు కొనుక్కొచ్చి పొయ్యి మీద పెట్టమని మల్లమ్మ పద్నాలుగేళ్ళ కూతురు రాజికి చెప్పింది. రాజి నూకలకు పోయి ఇంకా రాలేదు. దాని తర్వాత ఇద్దరు కొడుకులు. వాళ్ళు గవర్నమెంటు స్కూల్లో చదువుతున్నారు. వాళ్ళ తర్వాత ఓ కూతురు. అందరికంటె ఆఖరివాడు కొడుకు. వాళ్ళిద్దరు ఎక్కడో రోడ్డు మీద ఆడుకుంటున్నారు.

"ఇయ్యాల పోరగాల్ల కడుపులకు ఏంలేదు. ఇద్దరు పోరగాల్లు ఉత్త కడుపుతోనే ఇస్కూలుకు పోయింద్రు. రాజి ఒచ్చి కూడు ఒండితే పోరగాల్లు ఇస్కూలు నుంచి వచ్చి పగ టేలనన్న తినిపోతరు!" అని బరువైన ఇత్తడి ఇస్త్రిపెట్టెను తిప్పుతూ మల్లమ్మ ఆలోచిస్తున్నది. ఇస్త్రిపెట్టె బాగా వేడెక్కింది. వేడి చల్లారకముందే బట్టలు ఎన్నయితే అన్ని చేయాలని మల్లమ్మ తొందర తొందరగా ఇస్త్రిపెట్టెను తిప్పుతున్నది. ఇస్త్రిపెట్టె బరువుకు ఆమె కుడి భుజం రొండి పక్కకు వంగాయి. కాస్సేపు రొండి మీద చెయ్యేసి ఒత్తుకొని మళ్ళా ఇస్త్రిపెట్టెను తిప్పడం మొదలుపెట్టింది. "ఎక్కువసేపు నిలబడ్తే ఇస్త్రిపెట్టె సల్లార్తది. మొదలె బొగ్గు బాగ పిరమైంది' ' అనుకుంది మల్లమ్మ.

మల్లమ్మకు తండ్రి సంగయ్య పెండ్లిలో ఆ ఇస్త్రిపెట్టెను ఇచ్చాడు. ఇస్త్రిపెట్టె బరువుగా వుంటె ఇస్త్రీ బాగా అయితదని సంగయ్య కూతురుకు బరువైన ఇస్త్రి పెట్టెనే ఇచ్చాడు. ఒక రోజు ఆ ఇస్త్రిపెట్టెను ఎత్తుకపోయి చెంద్రయ్య మార్వాడి దగ్గర గిర్వికి పెట్టి ఆ పైసలతో సారా తాగి వచ్చాడు. అంతకు ముందటేడు చెంద్రయ్య మల్లమ్మకు తండ్రి పెండ్లిలో పెట్టిన కమ్మలు బంగారు గుండ్లు ఇల్లు జాగా కొంటనని నమ్మించి ఒల్చుకొనిపోయి అమ్మేసాడు. నిజంగానే ఇల్లు జాగా కొంటడు గదా అని నమ్మి మల్లమ్మ కమ్మలు గుండ్లు ఇచ్చింది. అంతే! అవి తీసుకపోయి అమ్మి చెంద్రయ్య నెలరోజుల దాకా పత్త లేకుండపోయాడు. నెలరోజులకు పీక్కపోయిన ముఖంతో వచ్చిన చంద్రయ్యను చూసిన మల్లమ్మకు దు:ఖమాగ లేదు.

"ఏమైందయ్యా! ఎక్కడన్న ఆగమైపోయినవ ఏంది? పాడు జాగా లేకపోతె లేకపాయె! జాగల కోసం కొట్టుకుంటుంద్రు పోలీసులకు పట్టిస్తుంద్రని మంది చెప్పుంటె ఇని రంది పెట్టుకున్న! నీకేం కాలేదు గద!" అని అడుగుతూ మల్లమ్మ చెంద్రయ్య దగ్గరిగా పోయింది. చిర్రుమని సారా కంపు కొట్టింది మల్లమ్మకు.

"అయ్య నాయినో! నా నగలన్ని అమ్మి ఈడు తాగుడుకు పెట్టిండురో! నాయినో! నేనేం జేయనురో!" అని వెంటనే ఏడ్పు అందుకుంది మల్లమ్మ.

ఆనాడే మల్లమ్మకు తెలిసిపోయింది. చంద్రయ్య తాగుడుకు బానిస అని. అతనికి ఇల్లు పిల్లలు సంసారమనే సోయి లేదని! అతడు మల్లమ్మ ఏడ్పు వినే స్థితిలోనే లేడు. ఇస్త్రి

బట్టల మూటల మీద ఒరిగిపోయాడు. మెలకువ వచ్చింతర్వాత "కూరలో టమాట యేసి ఒండిన. కూడు తిందుగాని రా!" అని పిల్చింది మల్లమ్మ.

చెంద్రయ్య తింటుంటె మల్లమ్మ మెల్లగా బుదగిరించి అడిగింది. "కమ్మలు గుండ్లేం చేసినవ్" అని. చెంద్రయ్య ఉల్కలేదు పల్కలేదు. అన్నంతిని కంచం దూరంగా నూకేసి కోపంతో బయటికి వెళ్ళిపోయాడు.

"కోపానికేం తక్కువలేదు. కమ్మలుగుండ్లేం చేసినవంటె చెప్తలేడు. అయి అమ్మిండు. ఆ పైసలతో జల్సలు చేసుకుంట తిరిగిండు. ఆ పైసలు ఒడిసినంక ఇంటిపట్టుకు ఒచ్చిండు! ఈనికి ఎప్పుడు నాశనగాలమొస్తదో!" అని మల్లమ్మ కన్నీళ్ళు కళ్ళల్లోనే కుక్కుకున్నది.

కమ్మలు గుండ్లు పోతె అక్కడితో మల్లమ్మ రెక్కలకష్టం ఆగిపోలేదు. కాని ఇస్త్రిపెట్టె పోయిన నాడు మల్లమ్మకు జీవనాధారమే పోయినట్లనిపించింది. పెద్దగా శోకం పెట్టి ఏడ్చింది. ఈ వార్త తెలిసి సంగయ్య వచ్చాడు. అల్లున్ని కోప్పడ్డాడు.

"ఏందయ్యా! గిట్ల నుక్సానయ్యే పనులు చేస్తే యెట్ల! కమ్మలు గుండ్లు అమ్మితివి. అయినా పోరి ఏమనక ఊకనే వుండె. ఇప్పుడు ఇస్త్రిపెట్టె తీస్కపోయి కుదువబెడ్తివి. ఇంట్లోల్ల పొట్ట ఎట్ల గడుస్తదన్న సీకూసింత లేదయ్యె నీకు. ఇస్త్రీలు చేసుకొని ఒక్కొక్కడు బంగ్లాలు కడ్తున్నరు. పోరగాల్లను సదివిచ్చుకుంటున్నరు! నీకేమైంది! - నువ్వేమో ఊరిమీదపడి తిరగ బడ్తివి. తాగుడుకే పైసలన్ని కర్సు పెట్టబడ్తివి. తాగనోల్లు వుండరుగాని గిట్ల ఇంట్లసామాన్లు పెండ్లం మీద నగలు అమ్మి తాగినోన్ని నిన్నే జూస్తున్న! నా బిడ్డ మల్లమ్మ సుఖపడ్తదని నీకిచ్చినగాని దాని కట్టమే నువ్వు కూసాని తింటవని అనుకోలేదు. పని ఒచ్చినోనివి గదా గింత పన్జేసుకొని గిన్ని పైసలు ఎనుక కేసుకొని దాన్ని బాగ చూసుకుంటవనుకున్న! అగో నీ పెద్ద కొడుకు పెన్నెండేండ్లోడయిండు. నిన్ను చూసి గా పోరడు పనికి ఒంగుతలేడు. పోరగాల్లను కన్నవుగాని ఆల్లను గురించి వీసమంతయిన దేవులాట లేదు. ఎట్లయితది గిట్లయితె తల్లిమాట యినక బడికి పోతనని సడకులు పట్టుకొని పాడు సావాసంతో తిర్గుతుండ్రు. పెద్ద పొల్ల సంవర్త ఆయే! దాని పెండ్లి గురించి ఏమైన సోయి వుంద నీకు! ఛీ ఏం బతుకయ్య నీది! నీకు నీ పోరలకు ఊడిగం చేసి చేసి నా బిడ్డ మల్లమ్మ బాదలు పడ్తున్నది!" అని సంగయ్య కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. తలకు చుట్టుకున్న రుమాలు తీసి సంగయ్య కళ్ళు తుడుచుకున్నాడు. సంగయ్య వున్న నాలుగు రోజులు చెంద్రయ్య ఇంటి పట్టున బుద్ధిగానే వున్నాడు. సంగయ్య తన పైసలుపెట్టి కుదువపెట్టిన ఇస్త్రిపెట్టెను విడిపించుకొచ్చాడు. సంగయ్య వెళ్ళిపోతుంటె మామను సాగనంపి వస్తానని అతని వెంట పోయిన చెంద్రయ్య మళ్ళా రాత్రే ఇంటికి తాగి సోలుతూ వచ్చాడు. అన్నం పెట్టమని అడగకుండా ఇస్త్రీ చేసే మేజు కింద వున్న బట్టల మూట మీద పడి నిద్రపోయాడు.

మల్లమ్మ ఇస్త్రీ చేసి చేసి కడుపులోకి కూడు సరిగ్గా లేక - వున్నా సమయానికి లేక ముప్పైయేళ్ళకే అరవైయేళ్ళదానిలా అయింది. మల్లమ్మకు పదకొండేళ్ళకే పెళ్ళయింది. సంగయ్యకు ఇద్దరుకొడుకుల తర్వాత మల్లమ్మ పుట్టింది. ఒక్కతే కూతురు. మల్లమ్మ పుట్టిం తర్వాతనే సంగయ్యకు కలిసి వచ్చింది. అందుకని పెళ్ళి ఘనంగానే చేసాడు. చెవులకు బంగారు రాళ్ళ కమ్మలు ముక్కులకు రెండు రాళ్ళ ముక్కుపుల్లలు మెడలో బంగారు గుండ్లు నడుంకు వెండి ఒడ్డాణం కాళ్ళకు కడియాలు పట్టా గొలుసులు పెట్టాడు. ఆ నగలన్నీ పెట్టు కొని అత్తగారింటికి వచ్చిన మల్లమ్మను చూసి ఇరుగుపొరుగు వాళ్ళు చుట్టాలూ "లచ్చిందేవి లెక్కగొడ్తున్న"దని అన్నారు. "చెంద్రయ్య నసీబు మంచిగుంది! గిసొంటి లచ్చిందేవి తీరుగున్న పిల్ల దొరికింది" అని మెచ్చుకున్నారు.

పెళ్ళయిన మూడేళ్ళకు మల్లమ్మ పెద్దదయింది. పెద్దదయిన నాలుగేళ్ళలోనే ఇద్దరు పిల్లలు పుట్టారు. మొదట కాన్పుకు సంగయ్య ఖర్చుపెట్టాడు. రెండో కాన్పుకు చెంద్రయ్య ఖర్చులకని మల్లమ్మ వెండి ఒడ్డాణం కడియాలు పట్టా గొలుసులు గిర్వీకి పెట్టాడు. కొడుకు పుట్టాడని పెద్దగా విందు చేసాడు. గిర్వీకి పెట్టిన నగలను మళ్ళా విడిపించనేలేదు. నాలుగో కాన్పు అయినాక మల్లమ్మ పిల్లలు కాకుంట ఆపరేషన్ చేయించుకుంటానంది. కాని చెంద్రయ్య సంతకం పెట్టడానికి ఒప్పు కోలేదు.

"ఎందుకు పెట్టవ్? పన్జేయనోనికి ఒళ్ళు ఒంగనోనికి ఎందుకంట గింతమంది పోరలు! మింగెటందుకు మెతుకు లేదు గాని ముదనట్టుపోనికి గీ రేషం ఏసాలయితే బాగనే వున్నయి!" అని మల్లమ్మ గులిగింది. ఏం చేయలేక ఊరుకుంది. చెంద్రయ్య అక్కడ నిలబడ కుండ సర్రున బయట పడ్డాడు.

ఆ తర్వాత ఐదో కాన్పుకు మల్లమ్మ దవాఖానాకు పోయి తెగించి పిల్లలు కాకుంట ఆపరేషను చేయించుకుంది. ఇంకా పిల్లల్ని కనేటందుకు ఒంట్లె రక్తం లేదని డాక్టరమ్మ కూడా మల్లమ్మకు ఆపరేషను చేయడానికి ఒప్పుకుంది.

మల్లమ్మకు ఆపరేషను అయింతర్వాత చెంద్రయ్య ఆమెను చూసేటందుకు దవా ఖానాకు పోయాడు. ఆరోజే సర్కారు నుంచి ఆమెకు బలంతిండి తినేటందుకని ఎనభై రూపా యలిచ్చారు. అవి మల్లమ్మ వేలిముద్ర వేయించుకొని చేతిలో పెడ్తున్నప్పుడే చెంద్రయ్య వచ్చాడు. మల్లమ్మ చేతిలో నుంచి గద్దలా అందుకున్నాడు చెంద్రయ్య. "నీకు పండ్లు బలం గోలీలు తెస్తనే! ఇగో గిప్పుడే గిక్కడున్నట్లే ఒస్త!" అని అంటు చెంద్రయ్య బయటికి వెళ్ళి పోయాడు. వచ్చినవాడు తల్లినిగాని పుట్టిన కొడుకునుగాని కన్నెత్తయినా చూడలేదు.

మళ్ళా మల్లమ్మ దవాఖానా నుంచి సాయంత్రం ఇంటికి పోయింతర్వాతనే ఓ రాత్రి కాడ చెంద్రయ్య ఇంటికి వచ్చాడు. ఎప్పటిలాగానే తాగిన మైకంలో వున్నాడు. రాగానే ఇస్త్రి

మేజు కింద బట్టలమూటల మీదపడి నిద్రపోయాడు పెద్దగా గురకపెడ్తూ.

"నీ తాగుడు పాడుగాను: ఆపరేసను చేయించుకుంటె యిచ్చిన పైసల్తోటి సిగ్గు ఎగ్గు లేకుంట తాగి పచ్చిబాలెంత పెండ్లం ఏమైంది ఎట్లుందని అరుసుకోలేదు. ఈడు మడి సేనా?" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది మల్లమ్మ.

ఆపరేషను అయినాక కొన్ని రోజులు బరువు లెత్తవద్దు ఆ తర్వాత మామూలుగా పని చేసుకోవచ్చునని డాక్టరమ్మ చెప్పింది. "ఎన్నుల నొప్పి లేస్తున్నది ఆపరేషను అయినంక. గీ నాల్గురోజులైనా ఇంటి పట్టునుండి ఇస్త్రి చేస్తడు" అనుకుంది మల్లమ్మ.

కాని చెంద్రయ్య పొద్దున్నే లేచి దండెం మీది కండువగుడ్డను దులిపి భుజం మీద వేసుకొని బీడి వెలిగించుకొని అర్రలకయినా తొంగి చూడకుండానే వరండాలోంచే బయటికి వెళ్ళిపోయాడు. మళ్ళా పదిరోజుల దాకా ఇంటికి రాలేదు. ఎక్కడెక్కడ తిరిగాడో ఏం చేసాడో తెలియదు!

"ఇయ్యాల ఏవేవో యాదికి ఒస్తున్నయి" అని అనుకుంటూ పాత జ్ఞాపకాలు ముసురు కోగా మల్లమ్మ ఇస్త్రిపెట్టెను దబాదబా తిప్పుతున్నది.

"గిప్పుడు ఇంట్ల నుంచి మాయమైండు. ఎప్పుడొస్తడో తెల్వదు!" అనుకుంది మల్లమ్మ.

ఇంతలో నూకలపొట్లంతో రాజి వచ్చింది. "అమ్మ! నూకలు గీ కొద్దిగన్నే ఒచ్చినయే నువ్విచ్చిన పైసలకు" అని పొట్లం చూపించింది రాజి.

"సరే! గిప్పుడైతె గవి ఒండు. ఏం జేస్తం. బియ్యం పిరమంటె నూకలక్కూడా దర మండి పోతున్నది. ఇగొ గీ గిరాకోల్లు గింతల పైసలిస్తె మల్ల తెచ్చి ఒండుదువు. గిప్పుడైతె గవి పొయ్యి మీదెయ్యి. నీ తమ్ముండ్లు ఒచ్చే యేల అయితున్నది. సీసల గింత తొక్కున్నది గది యేస్కొని తిని పోతరు" అంది మల్లమ్మ. రాజి లోపలికి పోయింది.

ఇంతలో చెంద్రయ్య తుఫానులా వచ్చాడు. "గింతల్నే ఒచ్చిండు మల్లేమైతదో" అను కుంది మల్లమ్మ. ఏం మాట్లాడలేదు. ఇస్త్రీ చేసుకుంటు మొగుని దిక్కయినా చూడలేదు.

చెంద్రయ్య వరండాలో నిలబడి లోపలికి తొంగి చూసాడు. రాజి నూకలు గాలిస్తున్నది. "అన్నీ మట్టిపెడ్డలూ రాళ్ళూ!" అని విసుక్కుంటున్నది రాజి.

చెంద్రయ్య మల్లమ్మ వైపు తిరిగాడు. "ఏందే! గింత పొద్దెక్కింది ఇంక కూడే ఒండలేద!- ఎందుకొండుతవు! బలుపెక్కింది నీకు! ముదనష్టపు ముండ! యేల్లకు మొగనికి గింత కూడు పెట్టాలన్న గ్యానం లేదు!" అని చెంద్రయ్య మెరుపులా ముందుకురికి మల్లమ్మ వీపు మీద గుబగుబమని గుద్దాడు.

హఠాత్తుగా పడిన దెబ్బలకు మల్లమ్మ ఇస్త్రిపెట్టె మీదికి వంగింది. "నీకేం నాశనగాలం పుట్టిందిరా ఇయ్యాల! గిట్ల కొడ్తున్నవ్! నీ చేతులు పడిపోను! ఏం పని చేయకున్న యేల్లకు

కడుపులకు కూడయితె కావాలె! అమ్మో! అయ్యో! ఈడు నన్ను బతకనిచ్చెటట్లు లేడు! నీ చేతులకు జెట్టలు పుట్ట! నన్ను దెబ్బలతో సంపుతున్నడయ్యో!" అని లబ్బలబ్బ మొత్తుకుంది మల్లమ్మ. పొద్దటి దెబ్బలకే ఆమె వీపు ఛాతి నొప్పిగా వున్నాయి. మళ్ళా చెంద్రయ్య గుద్దేసరికి తట్టుకోలేపోయింది.

"కొద్దిగయితే ముకం ఇస్త్రిపెట్టె మీద పడి కాలుతుండె! అరచేతుల్తో అదిమిపట్టుకున్న గట్ల పెద్దగండం తప్పింది" అనుకుంది మల్లమ్మ. ఆమెకు కళ్ళపొంటి ధారలుగా కన్నీళ్ళు కారుతున్నయి. అయినా దబాదబా ఇస్త్రీ చేస్తున్నది ఆగకుండ.

మల్లమ్మ తన వైపు చూడకుండ ఇస్త్రిపెట్టె తిప్పుతూ పోతుంటె చెంద్రయ్యకు కోపం ఆగలేదు. మల్లమ్మ శిగను ఒక చేతితో పట్టుకొని తన వైపు గుంజాడు. మరో చేతితో దొరికిన చోటల్లా బలంగా చరిచాడు. మల్లమ్మ ఆ దెబ్బలకు తట్టుకోలేకపోయింది. ఆమె నోరు బంద యింది. మొత్తుకొనుడు ఆగిపోయింది. నోరు బిగవట్టి మూలుగుతూ కింద కుప్పకూలి పడిపో యింది. లోపల్నుంచి రాజి వరండాలోకి పరిగెత్తుకొని వచ్చింది. తల్లిని చుట్టేసుకుంది. "జెట్ట ముండ సచ్చిందా? ఏంది?" అని చెంద్రయ్య భయపడిపోయాడు. అక్కడ నిలువకుండ మెల్లగా జారుకున్నాడు.

కాస్సేపటికి మల్లమ్మ కదిలింది. నీరసంగా వుంది. ఒళ్ళంతా నొప్పులు. రాజి మల్లమ్మను పట్టుకొని లేపి ఇస్త్రిపెట్టె తీసి కింద పక్కకు పెట్టి ఆ బల్లమీద తల్లిని పడుకోబెట్టింది. రాజి లోపలికి పోయి రాతెండి గిలాసలో నీళ్ళు తెచ్చి తల్లికి తాపింది.

"మీ అయ్య ఏడే?" అడిగింది మల్లమ్మ నీరసమైన గొంతుతో.

అటుయిటు చూసింది రాజి. చెంద్రయ్య కన్పించలేదు. చెంద్రయ్య ఆరోజు రాత్రివరకు రాలేదు. మర్నాడు రాలేదు. మరో ఏడాదైనా రాలేదు.

ఐదుగురు పిల్లలతో ఒక్కతె మల్లమ్మ మిగిలిపోయింది. ఇస్త్రిపెట్టెకే అంటుకపోయింది.

"దెబ్బలకు మల్లమ్మ సచ్చిందని పోలీసోల్లకు బయపడి ఎక్కడికో పారిపోయిండు ఆడు ఇగరాడు!" అన్నారొకరు.

"ఇంట్ల నుంచి ఉరికిపోయి రైలుటేషన్ల కదులుతున్న మాల్‌గాడి ఎక్కంగ సూసిన" అని ఒకరన్నారు.

చెంద్రయ్య ఎక్కడికి వెళ్ళిపోయాడో బతికాడో చచ్చాడో చాలారోజులు ఏండ్ల వరకు పత్త దొరకలేదు.

"జీడికల్లు కాడ చెంద్రయ్య లెక్కనే కన్పించిండు. ఒకాయన నెత్తి ఎంటికలు గడ్డం పెరిగినయి. సన్నాసి లెక్క కన్పించిండు. బిచ్చమెత్తుకుంటున్నడు! పల్కరిద్దమనేటంతల్నే కనుగప్పి మాయమైండు!" అని ఒకరోజు జీడికల్లు రాములువారి జాతరకు పోయి వచ్చిన

వాళ్ళున్నారు. ఇస్త్రీ జేస్తున్న మల్లమ్మతో

"ఎక్కడ సచ్చిండో సీకూసింత లేకుంట! సారాగుడంబ తాక్కుంట ! ఎక్కడున్నా అడు మారాజే! గీ పోరగాల్లు ఆగమైతరని రందివుంటె గిట్ల మాయమై పోతడ ఆడు! గీ పోరగాల్లను సాది పెండ్లిండ్లు సేసి అల్లకో దారి సూపేదనుకునయిన నా పెయిలో పానముంటె గంతేసాలు!" అనుకొని మల్లమ్మ నిట్టూర్చింది.

"యేడి సల్లారకముందే ఎన్ని బట్టలయితె గన్ని బట్టలు సేయాలె!" మల్లమ్మ దబాదబా ఇస్త్రీపెట్టెను తిప్పడంలో మునిగిపోయింది.

* * *